

కల్యాణం.. కమనీయం!





సత్యనారాయణస్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా కల్యాణ శోభతో శోభిల్లింది.. రత్నగిరి గురువారం ఉదయం నుంచి జనంతో కిక్కిరిసిపోయింది.. ఎటు చూసినా భక్తజనమే..కల్యాణ క్రతువు తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. కన్నులారా చూసి.. మనసారా స్వామిని దర్శించుకున్నారు.. ఉత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ పట్టువస్త్రాలు అందించారు. 6


కల్యాణ శుభవేళ.. అన్నవరం మిలమిల..

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రాజమహేంద్రవరం,మే 8 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించినట్టు ఆర్‌ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. జిల్లాలోని 37 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, 17 కేంద్రాల్లో మధ్యాహ్నం జరిగే పరీక్షలకు 20,466 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. పోలీస్, రెవెన్యూ, వైద్య, మునిపల్, పంచాయతీ, విద్యుత్, పోస్టల్,ఆర్టీసీ, విద్యాశాఖలు నిర్వర్తించాల్సిన విధులను నిర్దేశించారన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించ డానికి ఆయా శాఖలు సహకారం అందించాలని సూచించారన్నారు. ఇంటర్ బోర్డు సూపరింటెండెంట్ దశరథరామన్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేసీ చినరాముడు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రెడ్‌క్రాస్ దినోత్సవంలో జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం,ప్రపంచ తలసేమియా డే సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని సొసైటీ కార్యాల యంలో గురువారం వేడుకలు నిర్వహించారు. రక్తదాన అవగాహన ర్యాలీలో పాల్గొని రక్తదాన ఆవశ్యకతను వివరించారు.అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తొలుతగా జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ మూర్తి ఆధ్వర్యంలో హెన్రీ డునాంట్ జన్మదినం సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. రెడ్ క్రాస్ డే వేడుకల్లో భాగంగా సీతానగరం మండలం రఘుదేవపురంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.బొమ్మూరులోని హెచ్ఐవీ బాధిత విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. జీవ కారుణ్య సంఘంలోని వృద్ధులకు పండ్లు వితరణ చేశారు. కార్యక్రమంలో అర్బన్ తహశీల్దారు పాపారావు, రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధం.. సన్నద్ధం!


వెపన్ గురి పెట్టినా భయపడొద్దు : రాజమహేంద్రవరం వై జంక్షన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎందరో భారతీయ ఆడబడుచుల నుదుటి సిందూరాన్ని తుడిచేసిన ముష్కర మూకలకు ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ 'సిందూర్' పేరుతో వరుసగా చావు దెబ్బలు కొడుతోంది. పహల్గాంలో పర్యాటకులను చంపి రక్తపుటేరులను పారించిన రక్తపిశాచుల పీచమణిచి పాతాళంలోకి తొక్కేస్తోంది. తుపాకీ గుళ్లతో కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఎగదొస్తూ భారతీయ గుండెలను పదే పదే గాయపరుస్తోన్న పాకిస్తాన్‌కు దిమ్మ తిరిగేలా బుధ, గురువారాల్లో దెబ్బ కొట్టింది. సరిహద్దు స్థావరాల్లో సైనికులు ముష్కరమూకలను అడ్డుకుంటున్నారు.. ఒక్కడ వరకూ ఓకే.. మన వరకూ వస్తే ఏం చేయాలి.. అందుకే ఎవరేం చేయాలనే దానిపై గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. మనమేంటో చూపాలి.. అప్రమత్తంగా ఉండాలంటూ పిలుపునిచ్చారు.

- పాకిస్థాన్ నుంచి ముప్పు
- ఉమ్మడి జిల్లాలో హైఅలర్ట్
- తీరం వెంబడి డ్రోన్లతో నిఘా
- ఆరు నౌకల పహరా
- యుద్ధసన్నద్ధతపై మాక్‌డ్రిల్
- భద్రతపై ప్రజలకు అవగాహన

(కాకినాడ/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

జై భారత్.. జైజై భారత్ అంటూ ఆపరేషన్ సిందూర్‌లో మనం భాగం కావాల్సిన సమయం ఆసన్నమైంది.. ఎందుకంటే ప్రమాదం ఎటు నుంచి ఎలా వస్తుందో తెలియదు.. పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాల ను, అక్కడి రక్షణ వ్యవస్థలను భారత్ ఆర్మీ ధ్వంసం చేసిన నేపథ్యంలో శత్రుదేశం నుంచీ పొంచి ఉన్న ముప్పుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్రమత్తం చేస్తు న్నారు. మన వరకూ ప్రమాదం వస్తే మనమేం చేయాలి..ఎలా ఎదుర్కోవాలి.. బాంబులు వేస్తే ఎలా తప్పిం చుకోవాలనే దానిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ పేరుతో ఊరూ వాడా అవగాహన కల్పిస్తున్నారు. మరో వైపు ఆపరేషన్ సిందూర్ పేరుతో మన ఆర్మీ సాగిస్తోన్న పోరుకు మద్దతుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక సంస్థలు, వ్యక్తులు, పార్టీలు జాతీయ పతాకంతో సగర్వంగా జైహింద్ అంటూ నినదించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాల్లో యువత, పిల్లలు రోడ్డెక్కి గురువారం జాతీయపతాకంతో జయహో భారత్ అంటూ జేజేలు పలికారు.


అమలాపురం కిమ్స్‌లో..


ప్రమాదాన పడితే..రక్షణగా..


మధురపూడి విమానాశ్రయంలో హైఅలెర్ట్ ప్రకటించారు.. భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రయాణికులను మాత్రమే లోపలకు అనుమతిస్తున్నారు.

దాడుల నుంచి తప్పించుకోవడమెలా : మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో అవగాహన

అంతటా అప్రమత్తం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వై జంక్షన్‌లో డ్రిల్ చేపట్టారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్, బస్టాండ్, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఫైర్ డిపార్టుమెంట్ వారు యుద్ధసమయంలో ఎటువంటి సేవలందిస్తారో ప్రయోగాత్మకంగా వివరించారు. బాంబు దాడులు జరిగితే నేలపై పడుకుని రక్షించుకునే విధానాన్ని ప్రజలకు చేసి చూపించారు. జిల్లా అంతటా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాల్లో సోదాలు చేస్తూ అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. విమానాశ్రయంలోనూ మాక్ డ్రిల్స్ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రజలకు అవగాహన కల్పించడమే మాక్‌డ్రిల్స్ ముఖ్యోద్దేశమని అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వద్ద మాక్‌డ్రిల్ చేపట్టారు. అసాధారణ పరిస్థితుల్లో ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకునే విధానాన్ని వివరించారు.

రక్షణ..తీరాన!

కాకినాడ కోస్ట్‌గార్డు అప్రమత్తమైంది. సముద్ర జలాల ద్వారా పాకిస్థాన్ చొరబడే ప్రమాదం ఉన్నందున ఇక్కడ ఉన్న ఆరు నౌకలతో సముద్రజలాల్లో పహారా పెంచింది. మరోపక్క కాకినాడ, కోనసీమ జిల్లాల వ్యాప్తంగా తొండంగి నుంచి కాకినాడ, అంతర్వేది నుంచి ముమ్మిడివరం వరకు తీరం వెంబడి పోలీసుశాఖ సైతం అప్రమత్తమైంది. డ్రోన్లతో నిరంతర నిఘాను ముమ్మరం చేసింది. ఏ చిన్న అనుమానిత కదలికలు ఉన్నా తక్షణం తెలిసేలా అప్రమత్తమైంది. అటు కస్టమ్స్, పోర్టు, పోలీసు విభాగాలు సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా తీరం వెంబడి ఉన్న మెకనైజ్డ్ బోట్లు, చిన్న బోట్లను సైతం అప్రమత్తం చేశాయి. మరో పక్క శత్రుదేశం యుద్ధం ప్రారంభిస్తే ఏ విధంగా ప్రజలు తమను తాము కాపాడుకోవాలి..పోర్టులు.. నౌకలను ఏ విధంగా రక్షించుకోవాలనే దానిపై కాకినాడ యాం కరేజ్, డీప్‌వాటర్ పోర్టులో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మూడు దఫాలుగా కోస్ట్‌గార్డు ఆధ్వర్యంలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టులపై బాంబుల వర్షం కురిస్తే పోర్టును కాపాడుకోవడం, అత్యవసర వ్యవస్థలను ఏ విధంగా ఉపయోగించాలో చేసి చూపించారు. వివిధ దేశాల నుంచి కాకినాడకు బియ్యం లోడింగ్ కోసం వచ్చి సముద్రంలో లంగరు వేసిన ఎనిమిది నౌకల్లో శుక్రవారం రాత్రి ఏడు గంటల నుంచి 7.15 గంటల వరకు లైట్లన్నీ ఆపేసి చిమ్మ చీకట్లో నౌకలు ఉంటే ఏవిధంగా రక్షించుకోవచ్చో ప్రదరించి చూపించారు. కాగా కాకినాడ సీపోర్టులో ప్రస్తుతం ఆరు విదేశీ నౌకలున్నాయి. వీటిలోను రాత్రి లైట్లన్నీ ఆపేసి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.


సీ..న్ టూ సీన్ : సముద్రం మధ్యలో ఉన్న విదేశీ నౌకలో లైట్లు ఆపేసి మాక్‌డ్రిల్


భయంతో పడిపోతే : రాజమహేంద్రవరంలో వైద్య సిబ్బంది సీపీఆర్



వదలని వరుణుడు..

వరుణుడు వదలడంలేదు..అన్నదాతను నిద్దరోనీయడంలేదు.. ప్రతి రోజూ ఏదో ఒక మూల చినుకులు పడుతూనే ఉన్నాయి.. అన్నదాత పరుగులు పెడుతూనే ఉన్నాడు.. బిక్కవోలులో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా చినుకులు పడడంతో రైతులు పరుగు.. పరుగున వచ్చి ఇలా బరకాలు కప్పారు.. - బిక్కవోలు

ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

రాజమహేంద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గతంలో లక్ష్యం పూర్తయిందని కొనుగోళ్లు మందగించాయి. అయితే మళ్లీ ధాన్యం సేకరణ లక్ష్యం పెంచడంతో కొనుగోళ్లు సాగుతున్నాయి.జిల్లాలో గురువారం 5,845.560 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని పౌర సరఫరాల సంస్థ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం 24,602 మంది రైతుల నుంచి 2,84,098.680 టన్నులు కొనుగోలు చేశామన్నారు.వాటి నిమిత్తం రూ.654.04 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.550.26కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.

పుష్కర.. నిధులేవి!



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి.అంటే 2027 మే నెలలో నిర్వహించే అవకాశం ఉన్న గోదావరి పుష్కరాలకు దాదాపు రూ.3 వేల కోట్లతో ప్రాథమికంగా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. గత పుష్కరాలకు చంద్రబాబు సీఎంగా ఉన్నారు. ఆ పుష్కరాలకు సుమారు 5 కోట్ల మంది తరలివచ్చారు.ఇప్పుడు మళ్లీ సీఎంగా చం ద్రబాబు ఉన్నారు.కేంద్ర ప్రభుత్వం కూ టమిలో అంతర్భాగమై ఉంది.దీంతో గతం కంటే వైభవంగా పుష్కరాల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు వీరపాండ్యన్, విజయరామ రాజులను పుష్కరాల ప్రత్యేక అధికారులుగా నియమించారు. మరో వైపు అధికారులు ప్రాథమిక ప్రతిపాదనలను సిద్ధం చేశారు. రాజమహేంద్రవరానికి రూ.2 వేల కోట్లతో పుష్క ర ప్రతిపాదనలు పంపించామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు.ఇక పుష్కర పనులు శ్రీకారమే తరు వాయిగా కనబడుతోంది.

అంచనా రూ.3 వేల కోట్లు

2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పుష్కరాలు నిర్వహించారు. అప్పట్లో కేవలం రాజమహేంద్రవరంలోని ఘాట్ల అభివృద్ధి తదితర ఏర్పాట్లకు రూ.200 కోట్లు విడుదల చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్, రెవెన్యూ, కొవ్వూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో చేపట్టా ల్సిన పనులపై ఇప్పటికే అధికారులు అంచనాలు రూపొందించారు. రాజమహేంద్రవరం కార్పొరేష న్‌కు ప్రత్యేకంగా, మిగతా శాఖలకు ఆయా రెవెన్యూ డివిజన్ల కింద నిధులు విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రెవెన్యూ డివిజన్లకు రూ.1400 కోట్లతో అంచనాలు రూపొందించగా.. మరోవైపు నగర పాలక సంస్థ ఇప్పటికే 1587.80 కోట్లతో ప్రతిపా దనలు సిద్ధం చేసింది.రాజమహేంద్రవరం డివిజన్‌లో దాదాపు 550 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, మరమ్మతులు, విస్తరణ చేయడానికి రూ.400 కోట్లు అవసరత చూపిం చారు. కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశా రు. ఘాట్లకు వెళ్లే రహదారులు, ప్రధాన, పా ర్కింగ్ ప్రాంతాలకు..ఇలా నాలుగు విభాగాలుగా రహదారుల అంచనాలను రూపొందించా రు. రాజమహేంద్రవరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు తదితర నియోజకవర్గాల్లో ఘాటను మరింత అభివృద్ధి చేయనున్నారు.

గతం కంటే మెరుగ్గా

గత పుష్కరాలకు రాజమహేంద్రవరంలోని కోటిలింగాల ఘాట్‌ను 1.5 కిలోమీటర్ల నిడివితో నిర్మించారు. మిగతా ఘాట్లను అభివృద్ధి చేశారు. ఇప్పుడు వాటికి ఏమైనా మరమ్మతులు ఉంటే చేయడంతో పాటు కొత్తవి నిర్మించే అవకాశం ఉంది. ఈ మేరకు నిడదవోలు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో 29 ఘాట్లకు మరమ్మతులు, 4 కొత్త వాటికి రూ.100 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, కడియం మండలాల్లో 23 ఘాట్లకు మరమ్మతులు, 5 కొత్త ఘాట్ల నిర్మాణాలకు రూ.7 కోట్లు ప్రతిపాదించారు. మరో వైపు పర్యాటకానికి పెద్దపీట వేయనున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో సుమారు రూ.440 కోట్ల అంచనా వ్యయంతో వివిధ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు తయారు చేశారు.అగ్నిమాపక శాఖ రూ.8 కోట్లు, ఆర్టీసీ రూ.27కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా రూ.25కోట్లు, వైద్యారోగ్య రూ.8కోట్లు, విద్యుత్తు రూ.50కోట్లు..ఇలా అన్ని శాఖలూ ఆయా ఆర్డీవోలకు ప్రతిపాదనలు అందజేశాయి.

- రూ.3 వేల కోట్లతో ప్రాథమిక అంచనాలు
- మునిసిపల్ కార్పొరేషన్.. రెండు రెవెన్యూ డివిజన్లకు
- ఇప్పటికే రైల్వే స్టేషనుకు రూ.274 కోట్లు మంజూరు
- 2500 బస్సు సర్వీసులకు ఆర్టీసీ ప్రతిపాదనలు

పట్టాలెక్కని.. రైల్వే పనులు

అమృత్ భారత్‌లో భాగంగా రాజమండ్రి రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.274 కోట్లు విడుదలయ్యాయి. వీటితో రైల్వే స్టేషను రూపు అద్భుతంగా తయారు కానుంది. కానీ ఇంకా పనులు ఆరంభంకాలేదు. పనులు అంచనాల దశలోనే ఉన్నాయి. టెండర్లు ఎప్పటికి ఖరారు అవుతాయో పనులు ఎప్పుడు పట్టాలెక్కుతాయో ఇతమిత్థంగా తెలియని పరిస్థితి నెలకొంది. స్టేషన్ ఆధునికీకరణ పూర్తయితే 20 వరకూ ఎస్కలేటర్లు,7 లిఫ్టులు, తూర్పు వైపున 5 అంత స్తులు, పశ్చిమాన 3 అంతస్తులు, రిటైల్ అవుట్ లెట్లతో 24 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల నిడి వితో రూఫ్ ప్లాజాలు, 6 మీటర్ల వెడల్పుతో ఎఫ్‌వోబీలు, పశ్చిమాన బాగా పెద్ద సర్క్యులేటింగ్ ప్రదేశం అందుబాటులోకి రానున్నాయి. గతంలో 1700 ఆర్టీసీ సర్వీసులు నడపగా ఇప్పుడు 2500 బస్సుల అవసరత ఉందని రాజమండ్రి ఆర్టీసీ అధికారులు ఆర్డీవోకి ఇచ్చిన ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

మావోయిస్టుల ..
మృతదేహాలు తరలింపు

● నేడు రంపచోడవరంలో పోస్టుమార్టం.. బంధువులొస్తే అప్పగింత

● సంఘటనా వివరాలను సమీక్షించిన అల్లూరి ఎస్పీ అమిత్ బర్దర్



మృతదేహాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు



రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న మృతదేహాలు

వై.రామవరం / రంపచోడవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం శేషరాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను గురువారం పోలీసులు రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రేహౌండ్స్ పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు స్పెషల్ జోనల్ కమాండర్ జగన్, డిస్ట్రిక్ట్ కమాండర్ రమేష్ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వై.రామవరం పోలీస్టేషన్‌ను సందర్శించి ఎన్‌కౌంటర్ వివరాల గురించి ఆరా తీశారు. రంపచోడవరం డీఎస్పీ ప్రశాంత కుమార్ వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఈ సంఘటనతో తీవ్రభయాందోళనకు గురయ్యారు. ఆ ప్రాంతంలో సుమారు మూడు వందల మంది పోలీసులు మోహరించడంతో గిరిజనుల రాకపోకలు స్తంభించాయి. గత 19 ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న ఏవోబీ జోన్‌లోని వై.రామవరం మండలం ఒక్కసారిగా ఈ సంఘటనతో ఉలిక్కిపడింది. కాగా ఎన్‌కౌంటర్లో మృతిచెందిన ఇద్దరు మావోయిస్టు అగ్ర నేతలు జగన్, రమేష్ మృతదేహాలను గురువారం మధ్నాహ్నం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతుల బం ధువులు వస్తే వారికి అప్పగించే అవకాశం ఉందన్నారు.

ఇదిలా ఉండగా ఆసుపత్రి చుట్టూ పోలీస్ పహరా ఏర్పాటు చేశారు.

ట్రాక్టర్ అపహరించిన దొంగ అరెస్టు

● వివరాలు వెల్లడించిన రాయవరం ఎస్‌ఐ సురేష్‌బాబు

రాయవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): పుల్లల లోడుతో ఉన్న ట్రాక్టర్, ట్రైలర్‌ను అపహరించుకుపోయిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు రాయవరం ఎస్‌ఐ డీ.సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన రాయవరంలో విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడిలో మార్చి 10వ తేదీన స్థానిక గోదావరి రైస్‌మిల్లు దగ్గర ట్రాక్టర్‌తో పాటు పుల్లల లోడుతో ఉన్న ట్రైలర్ అపహరణకు గురైనట్టు ఆ గ్రామానికి చెందిన పిల్లి జానకి రామయ్య రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, గురువారం ఉదయం 10 గంటల సమయంలో వెదురుపాక శివారు గీతామందిరం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా బిక్కవోలు మండలం కొంకుదురు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఆపగా, అది చోరీ ట్రాక్టర్ అని నిర్ధారణకు వచ్చింది. దీంతో అనపర్తి మండలం నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి అనే డ్రైవర్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, హెచ్‌సీ సత్యకుమార్, పీసీ వీరేంద్రను ఉన్నతాధికారులు అభినందించారు.

కమనీయం
దివ్య కల్యాణం

మాంగల్య ధారణ మహోత్సవం



● సత్యదేవుడి కల్యాణాన్ని వీక్షించి తరించిన భక్తజనం ● పులకించిన రత్నగిరి

● వెండి గరుడ వాహనంపై స్వామి, వెండి గజ వాహనంపై అమ్మవారి ఊరేగింపు



కల్యాణోత్సవం సందర్భంగా జరిగిన నృత్య ప్రదర్శన



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న అతిథులు



అన్నవరం, మే8(ఆంధ్రజ్యోతి): భువన మోహన రూపుడైన సత్యదేవుడి కల్యాణం గురువారం రాత్రి రత్నగిరిపై భక్తజన నేత్రానందంగా అంగరంగ వైభవంగా జరిగింది. ఆద్యంతరహితుడైన స్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా కల్యాణ శోభతో శోభిల్లింది. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నాందీదేవత పఠన నిర్వహించిన అర్చకులు ధ్వజారోహణం చేసి గరుడ ద్విభాగం ఎగురవేసి స్వామి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. చైర్మన్ ఐవీ రోహిత్ పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. రాత్రి ఏడు గంటలకు బాజాభజంత్రీలు, వేద మంత్రాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ సత్యదేవుడికి వెండి గరుడ వాహనంపైన, అనంతలక్ష్మి అమ్మవారికి వెండి గజ వాహనంపై గ్రామోత్సవం జరిపి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సర్వ శిల్పకళా శోభితమై వివిధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాల అలంకరణతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వార్షిక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి అర్చకస్వాములు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన సీతారాములను మరో వేదికపై ఆశీనులు గావించి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కన్యావరుణ ఇచ్చి అమ్మవారితో మంగళగౌరీ పూజ చేయించారు. స్వామి, అమ్మవార్ల వంశవృక్షాలను వివరించే ప్రవరలను వేద పండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా స్వామికి అలంకరించారు. శ్రీచరణుని పాదాలను పవిత్ర జలంతో కడిగి పాదప్రక్షాళన, మధుపర్కప్రాశన జరిపి మధుపర్కాలను స్వామికి ధరింపజేశారు. చతుర్వేద పండితులు దేశ కాలమాన పరిస్థితులను వివరించే మహాసంకల్పం చెప్పి చూర్ణికా మంత్రాలు పఠించారు. సుముహూర్త వేళ భక్తరక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఉంచారు. అమ్మవారికి దివ్యతేజస్సు ప్రసాదించే యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించగా భక్తజన గోవింద నామస్మరణ మధ్య మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ అమ్మవారి మెడలో స్వామి మూడు ముళ్లు వేశారు. స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు మంచి ముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ భక్తులకు నేత్రానందం కలిగించారు. పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్లు దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ తంతును ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి నిర్వహించగా వేడకలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. కల్యాణాన్ని వీక్షించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు. కల్యాణం అనంతరం తొమ్మిది ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతల ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. సుమారు 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆ చిన్నారిది హత్యే..!

● పిఠాపురంలో అత్యంత అమానుష ఘటన

● క్షుద్రపూజలు అభూత కల్పనే

● పోలీసుల దర్యాప్తులో వెలుగుచూస్తున్న షాకింగ్ నిజాలు



చిన్నారి యశ్విత (ఫైల్)

పిఠాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో అత్యంత అమానుషంగా ఆరునెలల చిన్నారిని చిదిమివేసిన సంఘటన కీలక మలుపు తిరిగింది. హత్య చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఆ దిశగా పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీలోని ఒక ఇంటి లో నిద్రిస్తున్న ఆరునెలల చిన్నారిని నూతిలో పడవేయడం, అలాగే సమీపంలో క్షుద్ర పూజల ఆనవాళ్లు కనబడటం తీవ్ర సంచలనం రేకెత్తించింది. ఈ సంఘటనపై పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో షాక్ కలిగించే విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఇంటి వద్ద గుర్తించిన విషయాలు, క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ విచారణలో వెల్లడయిన అంశాలు ఆధారంగా చిన్నారి యశ్వితను హత్య చేసినట్టు నిర్ధారించారు. ఇంటిలోకి పరాయి వ్యక్తులు వచ్చే అవకాశం లేదని స్పష్టం కావడంతో ఇది కుటుంబసభ్యుల పనేనని నిర్ధారించారు. అందరిని తప్పుదోవ పట్టించేందుకే ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయ పెట్టి క్షుద్ర పూజల నాటకం ఆడినట్టు తెలుస్తోంది. అయితే ఇందులో ఎవరెవరి పాత్ర ఉందనే విషయాన్ని నిర్ధారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా చిన్నారి మృతదేహాన్ని తండ్రి సతీష్‌కు పోలీసులు అప్పగించారు.

12న అప్రెంటీస్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని వివిధ కంపెనీల్లో అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12 ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులను జిల్లాలోని ప్రముఖ పరిశ్రమల మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావలసిన వారిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసుకుంటారు. ఐటీఐల్లో వివిధ ట్రేడ్లలో ట్రైనింగ్ పూర్తి చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ కోరారు.

వయస్సు 23..అప్పులు రూ.5 లక్షలు

అన్న కళ్లెదుటే గోదావరిలోకి దూకి తమ్ముడు ఆత్మహత్య



భార్గవ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లవరం మే 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అల్లవరం మండలం బోడసకుర్రు బ్రిడ్జి పైనుంచి గురువారం మధ్యాహ్నం ఓ యువకుడు వైనతేయ గోదావరిలోకి దూకి మృతిచెందాడు. అతడిని రక్షించేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అల్లవరం పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం కామనగరువు గ్రామానికి చెందిన కామన భార్గవ్(23) గురువారం మధ్యాహ్నం బోడసకుర్రు బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకేశాడు. ఆ సమయంలో తమ్ముడిని రక్షించేందుకు అన్న రాజేష్ కూడా దూకేశాడు. రాజేష్ చేతికి చిక్కి నట్టే చిక్కిన భార్గవ్ చేయి జారిపోయాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న రాజేష్‌ను పైనుంచి గమనించిన ఓ లారీ డ్రైవర్ పగ్గం వేయడంతో రాజేష్ పగ్గం సహాయంతో అక్కడే కొట్టుమిట్టాడాడు. ఈ లోపు స్థానిక మత్స్యకారులు పడవ వేసుకుని వెళ్లి రాజేష్‌ను ఒడ్డుకు చేర్చారు. భార్గవ్ మాత్రం దొరకకపోగా స్థానికులు తాళ్లు వేసి రక్షించే ప్రయత్నం చేశారన్నారు. భార్గవ్ తాడును వదిలించుకుని నదిలోపలికి వెళ్లి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టగా యువకుడు దూకిన కొద్ది దూరంలోనే మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ టి.తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఘటనతో బోడసకుర్రు బిడ్జిపై వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా భార్గవ్ సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడని, తనకు అప్పులు ఇచ్చిన వాళ్లు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది.

అల్లూరి విగ్రహానికి పాలాభిషేకం

రెల్లుగడ్డలో అల్లూరిని అవమానించిన వైసీపీ నాయకుల తీరును కూటమి నిరసన



రెల్లుగడ్డలో అల్లూరి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

అల్లవరం, మే 8(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలను గాలికి వదిలేసిన వైసీపీ నాయకులు వారి పక్షాన పోరాటం చేస్తున్నట్టు అమలాపురంలో నిరసన శిబిరంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటం పక్కన తమ కాళ్లకు చెప్పులతో అవమానించారని వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ కూటమి నేతలు గురువారం నిరసన తెలిపారు. అల్లవరం మండలం రెల్లుగడ్డలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పచ్చిమాల ఏడుకొండలు పర్యవేక్షణలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కూటమి నేతలు పాలాభిషేకం చేసి వైసీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పులు వేసుకుని అల్లూరిని అవమాన పరిచిన వీడియో వైరల్ అవ్వడంతో టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారికి మంచి బుద్ధి ప్రసాదించాలంటూ నినాదాలు చేశారు. అల్లూరి వర్ధంతి నిర్వహించిన వైసీపీ నేతల్లో ఓ మాజీ మంత్రి, ఇద్దరు ఎమ్మెల్సీలు, వైసీపీ నేతలు చెప్పులు వేసుకోవడం దారుణమని అన్నారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, నడింపల్లి చంటిరాజు, పోతుల నాగరాజు, తోట నరసింహరావు, కొపనాతి తాతాజీ, కళ్లేపల్లి రామరాజు, వేగిరాజు శ్రీనురాజు, నార్గన శ్రీనివాస్, రాసూరి రాంబాబు, మామిడిశెట్టి శ్రీరామ్, నడింపల్లి సుబ్బరాజు, మందం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు



మోతుగూడెం, మే 8(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాం ప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ ఎంవీ స్వామినాయుడును నియమిస్తూ విజయవాడ విద్యుత్ సౌదా నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన విజయవాడ విద్యుత్ సౌదాలో హెచ్‌పీసీలో చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న స్వామినాయుడు సీలేరు కాంప్లెక్స్‌కు బదిలీపై వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు కడప ఆర్టీపీపీ స్టేషన్ చీఫ్ ఇంజనీర్‌గా బుధవారం బదిలీ అయ్యారు. వాసుదేవరావు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా 11 నెలల పని చేశారు. ఏపీ జెన్కోకు కొత్తగా సీలేరు కాంప్లెక్స్‌కు స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించే వరకు లోయర్ సీలేరు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఓఅండ్ఎంగా పని చేస్తున్న చిన్న కామేశ్వరరావుకు చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మత్స్య శాఖాధికారులపై విచారణకు ఆదేశం

కాకినాడ మే 8 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖలో అధికారులుగా పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచిన పలువురిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఏలూరు మత్స్య శాఖ జేడీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఫణిశేఖర్, భీమవరం డిప్యూటీ డైరెక్టర్ తిరుపతయ్యలపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీకు చెందిన అడిషినల్ డెరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌కు విచారణ బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగాలపై ఏలూరు మత్స్య శాఖ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన దీనదయాల్‌పైనా శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఇలా ఆరుగురు అధికారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

11న తలసేమియా బాధితులకు వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని రౌతు తాతాలు కళ్యాణ మండపంలో ఈనెల 11న తలసేమియా బాధితుల కోసం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని జైన్ సేవా సమితి వ్యవస్థాపకుడు విక్రమ్ జైన్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తలసేమియా బాధితులకు ప్రతీ 20 రోజులకు రక్తం ఎక్కించాలని లేకుంటే నిరసించిపోయి మరణించే ప్రమాదముందన్నారు. ఇప్పటి తమ సంస్థ ఆధ్వర్యంలో 17 మందికి బోన్ మ్యారో ఆపరేషన్ చేయిస్తే అందులో 14 మంది బతికారని చెప్పారు. ఈ ఆపరేషన్‌కి రూ.25ల క్షలు ఖర్చవుతుందన్నారు. జాగృతి బ్లేడ్ బ్యాంక్ వైద్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ తలసేమియా మైనర్లు ఇద్దరు వివాహం చేసుకుంటే వారికి పుట్టే పిల్లలు తలసేమియా బారిన పడతారని చెప్పారు. ముందుగా పరీక్షలు చేయించకుంటే హెచ్‌బీలో ఏ2 పెరిగివుంటే గుర్తించి తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా వైద్యం చేయించుకోవచ్చన్నారు. దీనికి సంబంధించిన పరీక్షకు రూ.2 వేలు అవుతుందని దానిని ఈ శిబిరంలో ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. మాగ్న వైద్యుడు వినయ్ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు రక్తం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. సమావేశంలో అశ్విన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం ఎంపీడీవో సస్పెన్షన్

వీఆర్‌పురం, మే 8(ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం ఎంపీడీవో శశిభూషణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గత రెండు నెలలుగా ఎంపీడీవో ఉన్నత స్థాయి అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకావడం లేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మద్యం తాగి, సిబ్బందిని దూషించడం వంటి విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ క్రమంలోనే ఆయనను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం కూనవరం ఎంపీడీవో అంజనేయప్రసాద్‌కు వీఆర్‌పురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సర్పవరం జంక్షన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలో భావనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామిని గరుడ వాహనంపై ఉంచి తిరువీధి ఉత్సవం నిర్వహించి ఎదురు సన్నాహం జరిపారు. రాత్రి 9గంటలకు అశేష భక్తుల గోవిందనామస్మరణ మధ్య వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు తలంబ్రాలను పంపిణీ చేశారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలకు కలెక్టర్ ప్రశాంతికి పురస్కారం



రాజమహేంద్రవరం, మే 8(ఆంధ్రజ్యోతి): ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడం, ప్రజా ప్రయోజనాలకు సొసైటీ సేవలను సమర్థవంతంగా వినియోగించడంతో కలెక్టర్ పి.ప్రశాంతికి రెడ్ క్రాస్ సొసైటీ పురస్కారం దక్కింది. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతికి గవర్నర్ అబ్దుల్ నజీర్ పురస్కారాన్ని అందజేశారు. 2022-23లో పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో సొసైటీ కార్యకలాపాలను చురుగ్గా అమలు చేయడంతో ఈ అవా ర్డుకు ఆమె ఎంపికయ్యారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో రెడ్ క్రాస్ కార్యక్రమాలను విస్తృత పరచాలన్నారు. సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. కలెక్టర్ ప్రశాంతికి జేసీ చిన్న రాముడు తదితరులు అభినందనలు తెలిపారు.

కాకినాడ బీచ్‌లో సైకత సిందూరం



ఆపరేషన్ సిందూర్ సైకత శిల్పం వద్ద ఏర్పాటుచేసిన జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

సర్పవరం జంక్షన్/గొల్లప్రోలు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో 'ఆపరేషన్ సిందూర్' సైకత శిల్పం ఆవిష్కృతమైంది. యంగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సైకత శిల్పి, గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపా ధ్యాయుడు పిల్లి గోవింద రాజులు, వాకాడ చిన్న గురువారం సుమారు ఏడు గంటల పాటు కష్టపడి మహిళా ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషీ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. దాని వద్ద జాతీయ పతాకం ఏర్పాటు చేయగా బీచ్‌కు వచ్చిన పర్యాటకులు, ఇతరులు గౌరవ వందనం సమర్పించారు.

ఆసుపత్రిలో సమస్యలుంటే మీడియాకు చెప్పొద్దు

» హెచ్‌వోడీలకే చెప్పండి » బయట వ్యక్తులకు చెబితే ఊరుకోం » ఆసుపత్రి సిబ్బందికి సూపరింటెండెంట్ హెచ్చరిక » ప్రభుత్వ బోధనాసుపత్రిలో తనిఖీలు



ఆసుపత్రి సిబ్బందికి సూచనలిస్తున్న సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బోధనాసుపత్రిలో విధుల నిర్వహణ సమయంలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత విభాగాల హెచ్‌వోడీలు, ఇన్‌ఛార్జిల ద్వారా కార్యాలయం పరిపాలనాధికారులకు తెలియజేయాలని ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ స్పష్టం చేశారు. ఈమేరకు ఆమె గురువారం ఒక సర్క్యులర్ జారీ చేశారు. ప్రాపర్ ఛానల్ ద్వారా కాకుండా మీడియా, ప్రెస్, బయటి వ్యక్తులు, ఇతర విభాగాల ప్రతినిధులకు నేరుగా తెలియజేస్తే దాన్ని సీరియస్‌గా పరిగణిస్తామని, తమ ఆదేశాలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.

ప్రతి మూడు నెలలకు రిక్వయిర్‌మెంట్ తెలపాలి

వైద్యసేవలకు అవసరమైన మందులు, సర్జికల్స్, ల్యాబ్ ఐటమ్స్ తదితర రిక్వయిర్‌మెంట్స్‌ను సంబంధిత విభాగాల హెచ్‌వోడీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి తమకు అందజేయాలని సూపరింటెండెంట్ తెలిపారు. ఫార్మసీ సూపర్‌వైజర్ హెచ్‌వోడీలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

కాగా, సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ గురువారం ప్రభుత్వాసుపత్రిలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంసీహెచ్ బ్లాకు, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డులు పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్‌కు సూచనలు చేశారు. మెడికల్ కాలేజీ పనులు కూడా పరిశీలించి, నిర్మాణ పురోగతిపై ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో బోధన విధులతో బాటు ఉపాధ్యాయులకు బోధనేతర విధులు కూడా ఎక్కువగానే ఉంటాయని, అందువల్ల ప్రతీ ఉన్నతపాఠశాలలో బోధనేతర ఉద్యోగులను విధిగా నియమించాలని సూచించారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్య కంటే అదనంగా స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వాలని త్రినాథబాబు పేర్కొన్నారు. అలాగే త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలలో అంతర్ జిల్లాల బదిలీలకు అవసరమైన ఆదేశాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

బిక్కవోలులో భారీ వర్షం

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి అంటున్న రైతులు



బిక్కవోలులో కురుస్తున్న వర్షం

బిక్కవోలు, మే 8(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో రెండు రోజులుగా మధ్యాహ్నం 1గంటల నుంచి 3గంటల వరకూ భారీగా వర్షం కురుస్తోంది. గురువారం మధ్యాహ్నం కూడా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఎండబెట్టుకున్న ధాన్యం తడవకుండా టార్పలిన్లు, బరకాలు కప్పుకుని కాపాడుకుంటున్నారు. అయితే అకాల వర్షం ఒక్కసారిగా రావడంతో మొత్తం ధాన్యానికి అంతా ఒక్కసారిగా బరకాలు కప్పడానికి వీలు కుదరక పోవడంతో కొంత మేర ధాన్యం తడిచి పోతుందని రైతులు వాపోతున్నారు. అందువల్ల తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా కొంతమంది వాహనదారులు వర్షాన్ని లెక్క చేయకుండా ప్రమాదమని తెలిసినా తలపై గుడ్డలు వేసుకుని, హెల్మెట్ పెట్టుకుని ప్రయాణం చేశారు.

చిరస్మరణీయుడు నల్లమిల్లి మూలారెడ్డి

జయంతి కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు శ్రీనివాస్



దొడ్డిగుంటలో మూలారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తు న్న పల్లా శ్రీనివాస్

రంగంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాలు ప్రజలకు సేవలందించిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి చిరస్మరణీయుడని టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జయంతిని గురువారం నియోజకవర్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డిగుంట గ్రామంలో టీడీపీ నాయకుడు వెలమర్తి సుధాకర్ ఏర్పాటు చేసిన మూలారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, గన్ని కృష్ణ తదితర కూటమి నాయకులు విచ్చేసి మూలారెడ్డికి నివాళులర్పించారు.

అనపర్తి: మండలంలోని రామవరంలోని మూలారెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి నివాళులర్పించారు. అనపర్తిలో ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేశారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

బిక్కవోలు: పందలపాకలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, బిక్కవోలులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి.. నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు.

ఉమాపార్వతి నర్సరీని సందర్శించిన ఎమ్మెల్యే సుదర్శనరెడ్డి



నర్సరీని సందర్శిస్తున్న ఎమ్మెల్యే

కడియం, మే 8 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం బుర్రిలంకలోని ఉమాపార్వతి నర్సరీని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శనరెడ్డి గురువారం సందర్శించారు. నర్సరీ రైతులు కొత్తపల్లి మూర్తి-శివాజీ బ్రదర్స్ సృష్టించిన 100ఏళ్ల వయసున్న టాల్‌బొన్సాయ్ వృక్షజాతి మొక్కలను ఆయన పరిశీలించారు. వాటి తయారీ, పెంపకం, లాభాలు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ముత్యం జగదీష్, అల్లంపల్లి శ్రీను, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలను విస్మరిస్తే సహించం: నల్లమిల్లి

ఏడీఏ కృష్ణ తీరుపై ఆగ్రహం

అనపర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, బాధ్యతలు విస్మరించే అధికారులను సహించబోమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి సావరంలోని రైతు సేవా కేంద్రంలో అనపర్తి, బిక్కవోలు మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు కావస్తోందని, ఇప్పటి వరకు ఎన్నిసార్లు సబ్ డివిజన్ పరిధిలో పరిశీలనకు వెళ్లారని ఏడీఏ కృష్ణను ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలారు. దీనితో ఎమ్మెల్యే ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు నెల రోజులుగా అనేక ఇబ్బందులు పడుతున్నారని అయినా రైతులను సమన్వయ పరచి ధాన్యం కొనుగోలులో చొరవ చూపాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. సబ్ డివిజన్ పరిధిలో సరైన రికార్డు కూడా ఏడీఏ వద్ద లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి టార్గెట్ పెరిగే విధంగా కృషి చేసింది రైతులను ఆదుకోవడానికేనని అన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు సహకరించి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలన్నారు.

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు అందజేత



రాజానగరం, మే(ఆంధ్రజ్యోతి):జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన క్రియాశీలక సభ్యత్వ కిట్లను రాజానగరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు ఈ ఏడాది సుమారు 18 వేలు వరకు నమోదు చేసి, కిట్లను అందజేశామన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతిఒక్కరికి త్వరలోనే ఆయా గ్రామాలకు అందజేస్తామన్నారు.

ఆపరేషన్ అలర్ట్



కోరుకొండలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

» అనుకోని బాంబుల దాడి జరిగితే ఇలా వ్యవహరించండి
» రాజమహేంద్రవరంలో సమన్వయ శాఖల మాక్ డ్రిల్
» విశాఖను కేటగిరీ-2గా ప్రకటించడంతో అప్రమత్తం: జేసీ



రాజమహేంద్రవరంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు



రాజమహేంద్రవరం సిటీ/బిక్కవోలు/కోరుకొండ/అనపర్తి, మే 8(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్మిన వేళ దేశంలో యుద్ధ సమయంలో వివిధ ప్రాంతాల్లో బాంబుల దాడి జరిగితే ఎలా వ్యవహించాలనే దానిపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఎక్కడికక్కడ మాక్ డ్రిల్స్ నిర్వహించి ప్రజలను జాగృతం చేస్తున్నాయి. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, వై-జంక్షన్ తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్యఆరోగ్య శాఖల సమన్వయంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, సిబ్బంది యుద్ధ సమయంలో ఎటువంటి సేవలు అందిస్తారో ప్రయోగాత్మకంగా వివరించారు. బాంబ్ దాడి జరిగినప్పుడు నేలపై కూర్చుని చెవులు, కళ్లు మూసుకుని కూర్చోవాలని, ఛాతిని నేలపై పెట్టకుండా మోచేతులపై బెండ్ అవ్వాలని, భవనాలు, ఇతర ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని ఎలా బయటకు తీసుకువెళ్లాలో ప్రదర్శించారు. అడ్డు వచ్చిన వాటిని కట్ చేసుకుని లోపలికి ప్రవేశించే విధంగా కటింగ్ మిషన్, దాడి జరిగిన చోట, అగ్నిప్రమాదం జరిగిన చోట విక్టిమ్ లోకేటెడ్ కెమెరాతో లోపలి వారిని గుర్తించే ప్రక్రియ కూడా ప్రదర్శించారు. అలాగే అపార్టుమెంట్లు, భవనాల్లో బాంబులు పెట్టినప్పుడు వాటిని ఎలా డిస్పోజ్ చేయాలో, ప్రమాదాలను దాటుకుని ఎలా బయటపడాలో పోలీసులు ప్రదర్శించారు.



అనపర్తిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పలుశాఖల అధికారులు

యుద్ధంలో గాయపడిన వారికి ఏవిధంగా వైద్యం అందించాలో, విషమస్థితిలో ఉంటే సీపీఆర్ ఎలా చేయాలో వైద్యసిబ్బంది ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని పర్యవేక్షించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నాన్ని కేటగిరి-2గా పరిగణించడంతో దానికి దగ్గగా ఉన్న రాజమహేంద్రవరంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు సమన్వయ శాఖల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్‌ను నిర్వహించి అవగాహన కలిగించామన్నారు. చేపట్టామన్నారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎయిర్‌పోర్టును, పరిశ్రమలు ఉన్నచోట్ల హైఅలర్ట్ ఉందన్నారు. కార్యక్రమం ఏఎస్పీ ఏవీ సుబ్బారాజు, ఆర్డీవో కృష్ణ నాయక్, పోలీసు, వైద్యఆరోగ్య, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బిక్కవోలులో తహశీల్దార్ సత్యకృష్ణ ఆధ్వర్యంలోను, కోరుకొండలో తహశీల్దార్ సుస్వాగతం ఆధ్వర్యంలోను, అనపర్తిలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలోను మాక్‌డ్రిల్ నిర్వహించారు. బిక్కవోలు ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారి దుర్గాదేవి, ఎస్ఐ రవిచంద్రకుమార్, కోరుకొండ ఎంపీడీవో అశోక్‌కుమార్, సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ, అనపర్తి తహశీల్దార్ అనిల్‌కుమార్, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



బిక్కవోలులో జాగ్రత్తలు వివరిస్తున్న తహశీల్దార్ కృష్ణ

అభివృద్ధి పనుల వేగం పెంచాలి

ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద ఎన్ఐయూఏ బృందం

రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి పై నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సమీక్షించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో జరిగిన సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న పనులు వేగం పెంచాలన్నారు. లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ వచ్చిన వారం రోజుల్లో పనులు ఎట్టి పరిస్థితుల్లో ప్రారంభం కావాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా జాప్యం జరిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి అధికారి కూడా తమ వద్దకు వచ్చిన ఫైల్‌ను 24గంటల్లోపే క్లియర్ చేయాలని పెండింగ్ ఎక్కడా ఉండకూడదన్నారు. పుష్కరాల నేపథ్యంలో రానున్న రెండేళ్లు ఎంతో కీలకం కనుక ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈలు మదర్సాలీ, మాధవీ, రీటా, డీఈలు, ఏఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఐయూఏ బృందం పర్యటన

రాజమహేంద్రవరంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్(ఎన్ఐయూఏ) బృందం పర్యటించింది. పుష్కరాల రేవు, గోదావరి తీరంలో పర్యటించిన బృందం అటుపై కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రివర్ సిటీస్ అలయెన్స్ (ఆర్‌సీఏ) అనేది నదీ తీరంలో ఉన్న నగరాలను అభివృద్ధి పరిచే ఓ బృహత్తర కార్యక్రమమని, దీనిని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2021 నవంబరు 25న అప్పటి కేంద్ర జల్‌శక్తి మంత్రి చేతులమీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పటి వరకు 146 నగరాలు సభ్యులుగా ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థ, రెవెన్యూ, అటవీ, టూరిజం, రుడా, పీహెచ్ఈడీ అధికారులతో కలిసి రెండు రోజుల పాటు ఎన్ఐయూఏ బృందం నగరంలో పర్యటించి 15కి పైగా నదీ సంబంధిత ముఖ్య ప్రాంతాలను పరిశీలించినట్టు తెలిపారు. నదీ పర్యావరణాన్ని అభివృద్ధి పరిచేందుకు రాజమహేంద్రవరం ఎంతో అనువైనదిగా ఈ బృందం గుర్తించిందన్నారు. రానున్న రోజుల్లో అర్బన్ రివర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ద్వారా రాజమహేంద్రవరం మరింత సుందరంగా ఆదర్శ నగరంగా మారుతుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు.

క్యాన్సర్ పేషెంట్‌కు ఎమ్మెల్యే వాసు ఆర్థికసాయం



రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న 42వ డివిజన్ రత్నంపేట వాంబే కాలనీకి చెందిన దొండపాటి జ్యోతికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.20 వేలు సాయం అందజేశారు. గురువారం తన కార్యాలయంలో బాధిత మహిళకు ఇంజక్షన్ నిమిత్తం నగదును అందించారు. అభాగ్యులకు తాము నిత్యం అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మళ్ళవెంకట్రాజు, కేవి శ్రీనివాస్, పేరూరి అంజి, బొమ్మనమైన శ్రీను, బాలు, రత్నంపేట చిన్ని పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ దినోత్సవం



సీతానగరంలో హెన్రీడూన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవ కారుణ్య సమాజంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి మానవతావాదంతో ముందుకు నడవాలన్నారు కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డి.నీలిమ, అధ్యాపకులు శరత్‌బాబు, పీవీబీ సంజీవరావు, టీసీ రత్నం, సీహెచ్ కుసుమ గాంధీ తదితరులతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయన హాస్పిటల్‌లో రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో భారతి, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎస్ఐ డి.రామ్‌కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీడూన్ హంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ 191 దేశాల్లో సేవలందిస్తూ మూడు నోబెల్ శాంతి అవార్డులు అందుకున్న ఏకైక సంస్థ అని అన్నారు. కార్యక్రమంలో ఎస్.సుధాకర్ ఉపాధ్యాయులు ఎన్.రాజు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల పాలై మెస్ నిర్వాహకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జెట్టి గ్రాండ్ ఎదురుగా ఉన్న నెల్లూరు మెస్ నిర్వాహకుడు కోలా శ్రీనివాసరావు(60) తన మెస్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. కొంత కాలంగా మెస్ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు నిర్వహణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చే పరిస్థితిలేదు. అతడు ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మెస్‌లో పనిచేసేవాళ్లు వచ్చి మెస్ తలుపులు తీసి చూసేసరికి శ్రీనివాసరావు లోపల ఉరివేసుకుని నిర్జీవంగా కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అతడు ఒంటరి అని, అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



గోకవరం, మే 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యనభ్యసించినపుడే మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ గుర్నానీ అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని గుమ్మళ్ళదొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల్లో విశేష ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్, నగదును గురువారం ఆయన బహుమతిగా అందజేశారు. అనంతరం ఆశిష్ గుర్నానీ విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసెడెంట్ వివేక్‌కుమార్‌శుక్లా, జీఎం ఐ.చంద్రశేఖర్, ఏఎస్‌వో భవానిశంకర్, హెచ్.ఎం. లక్ష్మీకాంతం, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

'మాజీ ఎంపీ జైలుకెళ్లడం ఖాయం'

రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఆవభూములు, దేవిచౌక్, పుష్కరఘాట్‌లలో అవినీతి రుజువై మాజీ ఎంపీ భరత్‌రామ్ జైలుకు వెళ్లడం ఖాయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. గురువారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌతమి సూపర్‌బజార్ స్థలం లీజుకు సబ్ లీజులకు ఇచ్చింది వైసీపీ ప్రభుత్వ హయాంలోనేనని, దానిపై విచారణ జరుగుతుందని కోర్టులో ఉన్నందున అప్పీల్‌కి వెళ్లారని త్వరలో ఈ స్థలంలో భవనం నిర్మాణం నిలుపుదల చేస్తారని చెప్పారు. ఇందులో కూడా భరత్ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు.

చాకుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

సీతానగరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన తుమ్మశెట్టి అంజయ్యపై చాకుతో దాడిచేసిన నీరుకొండ నారాయణపై అసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. అంజయ్యకు దుర్గాదేవి అనే మహిళతో పరిచయం ఉంది. సుందరి అనే మహిళ ఇంటి వద్ద దుర్గాదేవి పనిచేస్తోంది. అంజయ్య.. దుర్గాదేవి కోసం సుందరి ఇంటికి వెళ్లి సుందరితో మాట్లాడుతుండగా ఆమె భర్త నారాయణ వంటగదిలో ఉన్న చాకుతో దాడి చేయగా ఎడమ చేతి మణికట్టు వద్ద గాయమైంది. దీంతో 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2017 నవంబరు 21న లారీలో 266 కిలోల గంజాయిని తరలిస్తున్న దల్లి కామిరెడ్డిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడు విశాఖపట్నం జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డిపై నేరం రుజువుకావడంతో రాజమహేంద్రవరం 1వ అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శివకుమార్ తుది తీర్పును వెల్లడించారని పోలీసులు తెలిపారు.నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.1లక్ష జరిమాన విధించారు. ఈ కేసులో రెండో నిందితుడికి గతనెల 22న శిక్ష విధించారు.

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి.నెం.17867/1997-జి1 తేదీ. 06-05-2025

ప్రకటన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల దానవాయిపేట లే-అవుటు నందలి స్థలములకు చేర్చి ఉన్న కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు స్థల యజమానులు ఆక్రమించుకొని నిర్మాణములు చేసుకొనియున్నారు. సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలముల యొక్క ఆవశ్యకత ప్రస్తుతము లేనందున సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు అనగా కన్సర్వేన్సీ లేన్ స్థలముల అక్రమణదారులకు విక్రయించుటకు తీర్మానము నెం. 03/471/2011, తేదీ 30-04-2011 నందు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించినారు. సదరు విషయమై ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 488, తేదీ 11-12-2013 నందు దానవాయిపేట నందలి కన్సర్వేన్సీ లేన్ స్థలములను అక్రమణదారులకు విక్రయించుటకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారిని అనుమతించియున్నారు. శ్రీయుత జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు చదరపు గజము ఒక్కింటికీ నిర్ణయించు ధరకు లోబడి దానవాయిపేట కన్సర్వేన్సీ లేన్ స్థలములను అక్రమణదారులకు విక్రయించుటకు గాను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించియున్నారు.

ఇందు పై సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలములను గుర్తించి సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొనవలసినదిగా ఈ కార్యాలయము వారిచే నోటీసులు జారీ చేయడమైనది.

ఇందుపై ఈ క్రింది తెలిపిన మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులు కొనుగోలు చేయుటకు ఆసక్తి వ్యక్తపరచి దరఖాస్తులు దాఖలు చేసియున్నారు.

క్రమ సంఖ్య	కన్సర్వేన్సీ సర్వేనెంబర్ మరియు డోర్ నెంబర్	దరఖాస్తుదారు పేరు (కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమాని	కన్సర్వేన్సీ లేన్ స్థల విస్తీర్ణము	కన్సర్వేన్సీ లేన్ స్థలమునకు సరిహద్దులు
1.	దగ్గర తలుపు నెంబరు 46-16-39, వార్డు నెంబరు 5,బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం.494/P, 495/P & 492/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీసయ్యద్ నసీర్ తండ్రి సయ్యద్ శిలార్	15.89చ.గలు 6'-6'x 22'-0" 13.28 చ.మీ	తూర్పు:టి.ఎస్.నెం.492/పి 22'-0' పడమర:దరఖాస్తు దారుని స్థలము టి.ఎస్.నెం 495/పి & 496/పి-22'-0 ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.492/పి -6'-6' దక్షిణము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 492/పి-6'-6'
2.	దగ్గర తలుపు నెంబరు 46-22-07, వార్డు నెంబరు 5,బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం.309 & 310/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ నిట్టల సూర్యనారాయణ మూర్తి & నిట్టల ఆదిత్య	65.00 చ.గలు 90'-0'x 6.6" 54.34 చ.మీ	తూర్పు:టి.ఎస్.నెం.310/పి 90'-0' పడమర:దరఖాస్తు దారుని స్థలము టి.ఎస్.నెం 309-90'-0 ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.310/పి -6'-6' దక్షిణము:రోడ్డు టి.ఎస్.నెం. 310/పి-6'-6'
3.	దగ్గర తలుపు నెంబరు 46-16-11, వార్డు నెంబరు 5,బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం.516/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	ది.ప్రెసిడెంటు నివేదిత కిశోర్ విహార్ తెలుగు మీడియం ఎయిడెడ్ హై స్కూల్	86.65 చ.గలు 120 x (6+7)/2 72.45 చ.మీ	తూర్పు:దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.512పి -120'-0' పడమర:టి.ఎస్ నెం.516/పి-120'-0" ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.516/పి -7'-0' దక్షిణం:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 516/పి-6'-0
4.	దగ్గర తలుపు నెంబరు 46-11-6, వార్డు నెంబరు 5,బ్లాకు నెంబరు 9, టి.ఎస్. నెం.640/P & 642/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	చింతా వెంపారెడ్డి & మల్లిడి ఝాన్సీలక్ష్మి	36.67 చ.గలు (60'-0')x (5'-6') 30.66 చ.మీ	తూర్పు:దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.640/పి -60'-0' పడమర:టి.ఎస్ నెం.642/పి-60'-0" ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.642/పి 5'-6' దక్షిణం:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.642/పి -5'-6'
5.	దగ్గర తలుపు నెంబరు 46-15-15/2, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 8, టి.ఎస్. నెం.523/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	కె.శ్రీదేవి, భర్త: వేణు గోపాల్	21.67 చ.గలు (30'-0'x 6-'6') 18.11 చ.మీ	తూర్పు:దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.523/పి -30'-0' పడమర :కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం." 527/పి-30"-0" ఉత్తరము కన్సర్వేన్సీ లేన్ స్థలము టి. ఎస్.నెం.527/పి-6'-6' దక్షిణము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.527/పి -6'-6"

కావున పైన పొందుపరచిన కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులకు విక్రయించుటకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఏడు (7) రోజుల్లోపు లిఖితపూర్వకంగా నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరడమైనది.

కమిషనరు,
నగర పాలక సంస్థ, రాజమహేంద్రవరం.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.13 లక్షలు

ఆత్రేయపురం, మే 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,13,747 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా రమా సత్యనారాయణస్వామి కల్యాణం



ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 8(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి దేవస్థానంలోని ఉపాలయంలో ఉన్న రమాసత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామివారి విశ్వక్సేనపూజ, అంకుర్పారణ, ధ్వజారోహణం, నిత్యపోసాన, బలిహరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని జరి పారు. రాత్రి రమా సత్యనారాయణస్వామి దివ్య కల్యాణ మహోత్సవం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. అశేష భక్తజనం స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కమండలేశ్వరస్వామి కల్యాణం: ర్యాలి గ్రామంలోనున్న ఉమా కమండలేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అంకుర్పారణ, ధ్వజారోహణ, బలిహరణ తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపారు. అనంతరం స్వామివారి దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్త లు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

ఎక్సైజ్ డీఎస్పీ పూజలు: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆల యంలో గురువారం రాజమండ్రి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వినిషా కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రం అందజేశారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పా ట్లను పర్యవేక్షించారు.

రెవెన్యూ క్విజ్ పోటీల్లో ఉద్యోగుల సత్తా

మండపేట, మే 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన రెవెన్యూ క్విజ్ పోటీల్లో మండల రెవెన్యూ ఉద్యోగులు ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారని మండల తహశీల్దార్ పి.తేజేశ్వరరావు చెప్పారు. అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రథమస్థానం దక్కించుకున్న ఆయన మొదటి బహుమతి ల్యాప్‌ట్యాప్ గెలుపొందారు. జిల్లాస్థాయిలో మండపేట రెవెన్యూ టీం ప్రథమస్థానంలో నిలిచింది. ఎంఆర్‌వో టీం సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్వేయర్ ఎం.సుజాత, డీటీ కల్యాణి, వీఆర్‌వోలు రవి కుమార్, విజయరాజు, తాపేశ్వరం విలేజ్ సర్వేయర్ నారాయణమూర్తితోపాటు టీం సభ్యులను జిల్లా అధికారులతోపాటు డివిజన్ రెవెన్యూ ఉద్యోగులు తదితరులు అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



సూర్యనగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామని టీడీపీ సీనియర్‌నేత వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం పట్టణంలో పలు వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ జి.శ్రీకాంత్, ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలసి శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మాజీ ఏఎంసీ చైర్మన్ జి.సూర్యనారాయణమూర్తి, మున్సిపల్ ఏఈలు సునీల్, శివ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, జాస్తి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రోత్సాహం అందించేందుకు లఖ్‌పతీ దీదీ



యూనియన్ బ్యాంక్‌లో ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ హెడ్ విశ్వేశ్వరరావు

రాయవరం, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళలను ప్రోత్సహించేందుకు వివిధ రకాల పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని యూనియన్ బ్యాంక్ రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు తెలిపారు. గురువారం రాయవరం యూనియన్ బ్యాంక్‌లో రుణాలపై అవ గాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన లఖ్‌పతీ దీదీ యోజన స్కీంను మహిళలు సద్వినియో గం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. బ్యాంక్ మేనేజర్ వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రీజనల్ హెడ్ పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం అర్హులైన సంఘాలకు ఒక్కొక్కరికి 20 లక్షల రుణాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ మనోజ్, డీఆర్‌డీఏ వెలుగు, ప్రాజెక్టు మేనేజర్ డి.అన్నపూర్ణ, చీఫ్ మేనేజర్ వి.సత్యానారాయణ, యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, వీఓఏలు రాణి, పద్మ, దేవి, సౌజన్య, ఖాతాదారులు, రైతులు, మహిళా శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు

పంట కాలువలకు నిధులు మంజూరు



గుర్రపుడెక్కతో మూసుకుపోయిన చొప్పెల్ల-వెదురుమూడి కాలువ

అలమూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా పంటకాలువలకు కనీసం మరమ్మతులు లేక వాటి ద్వారా సాగునీరు చేరక ఇబ్బందులు పడుతున్న రైతులకు చల్లటి కబురు చేరింది. ఐదేళ్లలో పంటకాలువలకు కనీసం నిధులు కేటాయించకపోవడంతో కాలువ చివర భూములకు సాగునీరు అందడం లేదు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పంట కాలువలలోని తూటును తొలగించేందుకు నిధులు మంజూరు చేసింది. ఆలమూరు ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని 24 పంట కాలువల్లో చెత్త, తూటు తొలగింపునకు రూ.35 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పంట కాలువల్లో ఉన్న తూటు తొలగింపునకు చర్యలు తీసుకోనున్నారు. పంట కాలువల్లో నీరులేకపోవడంతోపాటు ఇప్పుడు తూటును తొలగించడం వల్ల మళ్లీ సాగునీటి సమయానికి తూటు వచ్చే ప్రమాదం ఉందని అందువల్ల సార్వా వరిసాగుకు ముందుగా పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పంట కాలువల దుస్థితిని గుర్తించి నిధులు మంజూరు చేయడంపై సాగునీటి సంఘాల పాలక మండళ్లు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. పదో రోజు గురువారం విద్యార్థులు పుస్తక పఠనం నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు సుబ్బరాజు విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లీస్‌పై శిక్షణ అందించారు. హెచ్‌ఎం సీహెచ్ సత్యనారాయణ వ్యక్తిత్వ వికాసంపై కలిగే ప్రయోజనాలు, విద్యార్థి దశలో క్రమశిక్షణ తదితర అంశాలపై తెలిపారు. గ్రంథాలయాధికారి నమ్మి శివాయ జనరల్ నాలెడ్జ్ అంశాలు బోధించారు.

విద్యుత్ అంతరాయంతో నిలిచిన తాగునీటి సరఫరా

కె.గంగవరం, మే 8(ఆంధ్రజ్యోతి): దంగేరు గ్రామంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామానికి లైన్‌మేన్ లేకపోవడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. దీంతో గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకుకు నీరు నింపే అవకాశం లేక తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రామానికి పూర్తిస్థాయిలో లైన్‌మన్ నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని నెలలుగా గ్రామానికి లైన్‌మన్ లేకపోవడంతో తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

పాపవినాశేశ్వర, అగస్తేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, మే 8(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో ఉన్న దుర్గామాత సమేత పార్వతిపాపవినాశేశ్వర స్వామి, పార్వతీమాత సమేత అగస్తేశ్వర స్వామివార్ల దివ్య కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు కాలధరి కార్తికేయశర్మ ఆధ్వర్యంలో వేద, స్మార్త, ఆగమ పండితులు మండపారాధన, ధ్వజారోహణ, గణపతి పూజలను కాలధరి ఉమామహేశ్వరరావు, పండితులు సూరిపండు, కార్తికేయశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం, ధ్వజారోహణ, కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



వికసించిన బ్రహ్మకమలం

మండపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన అడపా నారాయణబాబు ఇంటనున్న బ్రహ్మకమలం మొక్కకు రెండు పూలు విరబూశాయి. ధర్మగుండం చెరువు ప్రాంతంలో ఉంటున్న ఆయన మూడేళ్ల క్రితం కడియంలో దీన్ని కొనుగోలు చేశారు. ఇప్పుడు ఈ మొక్క రెండు పూలతో చూపరులను అబ్బురపరుస్తోంది.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

కొత్తపేట, మే 8(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలని కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఇందులో భాగంగా సారా తయారీ, అమ్మకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సారా నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సారా ప్రభావిత గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచేందుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు, కళాజాతలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకూ 67 మందిపై కేసులు నమోదు చేసి 114 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 38వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

తండ్రిపై కుమార్తె దాడి

మలికిపురం, మే 8(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో తండ్రిపై కుమార్తె దాడి చేసిన సంఘటన మలికిపురంలో జరిగింది. ఇంజేటి శ్రీనుపై కుమార్తె చాకుతో దాడి చేసినట్టు, ఆస్తి తగాదా విషయమై గురువారం మధ్యాహ్నం ఘర్షణ పడ్డారు. ఘర్షణ శృతిమించడంతో కుమార్తె చాకుతో తండ్రిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన శ్రీనును ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మేలైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు.

నేడు వాహనాలకు వేలం పాట

ముమ్మిడివరం, మే 8(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలతో పట్టుబడిన కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించినట్టు ఇన్‌చార్జి సీఐ రవితేజ తెలిపారు. అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.2వేలు దరావత్తు చెల్లించాలన్నారు. వాహనాలను అమలాపురం ఆర్టీవో నిర్ణయించిన మేర పెంచి వేలం నిర్వహిస్తామన్నారు. పాటలో హెచ్చుపాటదారుడు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. బజాజ్ పల్సర్ బైకు 1, హీరో స్ప్లెండర్ ప్లస్ బైకులు 3, టాటా ఇండికా కారు 1, బజాజ్ పల్సర్ స్కూటీ 1, సుజుకీ స్కూటరు 1, హీరోహోండా స్ప్లెండర్ బైకు 1 వాహనాలకు సంబంధించి వేలం జరుగుతుందని ఆయన తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రావులపాలెం, మే 8(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు ముక్తేశ్వరరావు తెలిపారు. రేషన్ కార్డుల్లో పేరు మార్పులు, కొత్త రేషన్ కార్డుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అందిస్తామన్నారు.

మహిళల ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వేగుళ్ల



ద్వారపూడిలో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ద్వారపూడి సచివాలయం1 పరిధిలో గురువారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళ కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు స్వయంశక్తిపై నిలబడేందుకు కుట్టుశిక్షణ దోహదపడుతుందన్నారు. మూడునెలలపాటు శిక్షణ అనంతరం వారికి ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తామన్నారు. అనంతరం ఎంపీపీ ఉండమట్ల వాసు, ఎంపీడీవో మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.వెంకటరమణ, జెడ్.మేడపాడు సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, తాపేశ్వరం సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, మాజీ ఎంఎసీ చైర్మన్ రమేష్‌రాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, జనసేన నాయకులు చింతా దొరబాబు, కె.మురళీకృష్ణ, గోణం పుల్లయ్య, సలాది బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్, ద్వారపూడి, జెడ్.మేడపాడు పంచాయతీ కార్యదర్శులు ఆకులు వీవీ రమణ, వీ.ఆమర్‌నాథ్‌చౌదరి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

కె.గంగవరం, మే 8(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిపోని ధాన్యం గురించి రైతులు ఆందోళన చెందవద్దని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో పామర్రు, కూళ్ల ఉన్నత పాఠశాల ఆటస్థలాల్లో ధాన్యం రాశులు వర్షం నీటిలో మునిగిన నేపథ్యంలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. గురువారం కూళ్ల ఉన్నత పాఠశాల ఆటస్థలంలో పార్టీ నాయకులతో కలిసి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు, చిట్టూరి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కూళ్ల గ్రామంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు సత్యం తదితరులు

ఘనంగా రుద్రాభిషేకం, కల్యాణోత్సవం

కపిలేశ్వరపురం, మే 8(ఆంధ్రజ్యోతి): తాతపూడిలో ఉన్న పార్వతీ మల్లేశ్వరస్వామి వారి రుద్రాభిషేకం, కల్యాణోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాగాపు వీరభద్ర శివాచార్య పర్యవేక్షణలో పలువురు పండితులు ఉదయం ప్రదక్షిణ, గణపతిపూజ, మృత్యుంజయ, పాశుపత రుద్రాభిషేకం బిల్వార్చన తదితర పూజలను వేదమంత్రోశ్చరణ మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అగ్నిప్రతిష్టాపన, లక్ష్మీగణపతి హోమం, రుద్ర హోమం, మూలమంత్ర హోమం, సాయంత్రం పార్వతి అమ్మవారికి సౌభాగ్య శ్రీచక్ర ఆవరణ కుంకుమార్చన, శిఖరమహా కుంబాభిషేకం, పార్వతి మల్లేశ్వరస్వామి ద్విద్య కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో 45 మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



తాతపూడిలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఒప్పంద కార్మికుల మెరుపు సమ్మె

మండపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒప్పంద వేతనంపై పనిచేసే కార్మికులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కార్మికులు గురువారం సమ్మెబాట పట్టారు. అందులో భాగంగా గురువారం ఉద్యోగులు తమ నిరసనను మున్సిపల్ కార్యాలయం వద్ద తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు పి.సుబ్బరాజు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ప్రతి ఒక్క ఉద్యోగిని పర్మినెంట్ చేయాలని హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒప్పంద కార్మికులు కప్పల సురేంద్ర, టేకి సురేంద్ర, పిట్లా వెంకన్న, గంటి నవీన్‌కుమార్, వేంకటేశ్వర్లు, తలాటి వెంకన్న బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఒప్పంద కార్మికులు

సోమేశ్వరస్వామి వెండి కిరీటాలు బహూకరణ



సోమేశ్వరం శివాలయంలో వెండి కిరీటాలు అందజేస్తున్న దాతలు

రాయవరం, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలా త్రిపురసుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయానికి గురువారం దాతలు వెండి కిరీటాలను బహూకరించారు. గ్రామానికి చెందిన మల్లిడి ఆదిరెడ్డి, సావిత్రి దంపతుల జ్ఞాపకార్థం ఆమె మనవరాలు, మనవడు చేయించిన వెండి కిరీటాలను ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మకు అందజేశారు. ఆలయంలో పూజలు, సంప్రోక్షణ అనంతరం కిరీటాలను స్వామివారికి అమ్మవారికి అందజేశారు.

ఘనంగా సోమేశ్వరస్వామి కల్యాణం: సోమేశ్వరం బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి దివ్య కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ, సోమశేఖరశర్మ అర్చకత్వంలో ధ్వజారోహణం, నందివాహన సేవ స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి అమ్మవారి ఉత్సవ మూర్తులకు దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో మాజీ సర్పంచ్ వైఆర్కే పరమహంస, రావుల రామకృష్ణ, అంబరవరపు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మే 20 నుంచి దేశవ్యాప్త సమ్మెకు కార్మికుల పిలుపు

మండపేట, మే 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి సి.వేంకటేశ్వరరావు కార్మికులకు పిలుపునిచ్చారు. మండపేటలో గురువారం స్థానిక కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, గంధం శ్రీను, చల్లా శ్రీను, మేడపాటి సత్తిబాబు, వినకోటి సత్యనారాయణ, కంబాల సత్తిబాబు, జట్టుమిల్లు కార్మికులు పాల్గొన్నారు.



మండపేటలో సమస్యలపై చర్చిస్తున్న పలువురు కార్మికులు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం

ద్రాక్షారామ, మే 8(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ప్రాంగణంలో ఉన్న సత్యనారాయణ స్వామివారి కల్యాణం గురువారం రాత్రి జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులు చేశారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం తదుపరి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి కల్యాణం తంతు ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహ వచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, రాత్రి 8.35 గంటలకు సుమూహూర్తం నిర్వహించారు. తదుపరి మాంగల్యధారణ, తలంబ్రాలు కార్యక్రమాలు కల్యాణబ్రహ్మ జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పలువురు సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటుదక్కిన పత్రంతో వీరరాఘవరావు

తెలుగు ఉపాధ్యాయుడికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

మండపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నక్కిన వీరరాఘవరావుకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. తనకు దక్కిన ధృవీకరణ పత్రాన్ని గురువారం ఆయన పాత్రికేయులకు చూపించారు. తెలుగు ఉపాధ్యాయుడుగా, పాఠ్య పుస్తక రచయితగా, రాష్ట్రవిద్యా పరిశోధన శిక్షణ మండలి నిపుణుడిగా వ్యవహరిస్తున్న రాఘవరావు పలు రచనలు చేశారు. ఆయన రచనలను గుర్తించిన ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన పేరుకు స్థానం కల్పిస్తూ పత్రం అందించారని తెలిపారు. ఆయన్ను మండపేట అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అభ్యుదయ రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జి.స్వామిప్రసాద్ తదితరులు అభినందించారు.



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

ఆకట్టుకున్న విద్యార్థినుల కూచిపూడి నృత్య ప్రదర్శన

రాయవరం, మే 8(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు హైదరాబాద్ రవీంద్ర భారతిలో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా గురువారం చిన్నారులను పలువురు అభినందించారు. రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రాజమండ్రికి చెందిన నాట్య గురువు చక్రవర్తుల పవన్‌కుమార్ రాయవరం హైస్కూల్ విద్యార్థినిలకు కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇచ్చారు. తొలి ప్రదర్శనగా విద్యార్థినిలు గురువారం నృత్య ప్రదర్శన చేశారు. నృత ప్రదర్శన చేసిన ఎం.శరణ్య, ఎం.చరిష్మ, ఎం.రూపశ్రీ, పి.దేవి, గుడాల దీపికలను పాఠశాల హెచ్‌ఎం వి.శాంతి సునిత, తెలుగు ఉపాధ్యాయుడు డి.సుబ్బారావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అల్లవరం మే 8(ఆంధ్రజ్యోతి): యెంట్రుకోనలో ఈనెల 5న కనకమహాలక్ష్మి వేములమ్మ జాతర నుంచి ఇంటికి వెళుతూ కోడూరుపాడు గుడ్డివాని చింత వద్ద మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు చికిత్స పొందుతూ కాకినాడ ఆసుపత్రిలో గురువారం మృతి చెందాడు. అంబాజీపేట మండలం పాలగుమ్మి ప్రాంతానికి చెందిన దేవగుప్తం వీరవినయ్ (28) జాతర నుంచి ఇంటికి వెళుతూ ప్రమాదానికి గురయ్యాడన్నారు. కాకినాడ ఆసుపత్రిలో గురువారం దేవగుప్తం వీరవినయ్ మృతి చెందాడని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాట్రేనికోన, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెయ్యేరు అగ్రహారంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. కాట్రేనికోన నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటోలు ప్రయాణిస్తున్న నడవపల్లి గ్రామానికి చెందిన కె.మంగమ్మ, ఆమె కుమార్తె రజని గాయపడ్డారు. సర్పంచ్ సురేష్, ఏఎస్ఐ సత్యనారాయణ గాయపడిన మహిళలను ఆసుపత్రికి తరలించారు.

నేడు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గారావు

తాళ్లపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్న దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రక్కిలంక పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 117 జీవో రద్దు, పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్యాలు, తదితర వాటి గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదు తరగతులను కొనసాగించాలన్నారు. సమావేశంలో షేక్ జిలానీ, సలీం, రఘవీర్ శాస్త్రి, రాజారత్నం, నాని, తదితర సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకులకు శిక్షణ


శిక్షణ అందజేస్తున్న ప్రొఫెసర్ ఉదయభాస్కర్

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే అధ్యాపకులు నిష్ణాతులై ఉండాలని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రమేష్ అన్నారు. కళాశాల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఆదేశాల మేరకు గురువారం కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు. ఆదికవి నన్నయ్య వర్శిటీ కామర్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. ఉదయభాస్కర్ వాణిజ్యం, నిర్వహణలో ఫలితాల ఆధారిత అభ్యాస పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఉదయభాస్కర్‌ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రమేష్, అధ్యాపకులు సత్కరించారు. కోడూరి రామకృష్ణ, నయింబేగ్, కె. కృష్ణకిషోర్, డిబిఆర్ కుమార్, వి. ధామ్సన్, యు. సుబ్బారావు, ఎండీ అహ్మదుల్లా ఖాన్, పీఎస్ ప్రవీణ్, ఎన్. శివన్నారాయణ, పీజీ డైరెక్టర్ సీహెచ్‌వీ చలపతిరావు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీకి కృషి చేయాలి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద సేంద్రియ ఎరువులు తయారు చేస్తే పంచాయతీలకు ఆదాయంతో పాటు రైతులకు సేంద్రియ ఎరువులు అందించవచ్చని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. గురువారం ఆయన స్థానిక సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.వేణు గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎన్.రవి కిషోర్, షేక్ సబీనాబేగం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి : రాజీవ్‌కృష్ణ


చాగల్లులో మాట్లాడుతున్న టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

చాగల్లు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని టీడీపీ నేత ఎస్. రాజీవ్ కృష్ణ అన్నారు. గురువారం చాగల్లు విచ్చేసిన ఆయన మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబును పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హరిబాబును పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈయనతోపాటు జడ్పీటీసీ గారపాటి విజయదుర్గ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిడదవోలులో మెగా జాబ్‌మేళా

నిడదవోలు, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని నియోజకవర్గ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేశానికి ప్రజలు అండగా నిలవాలి : ఆర్డీవో


కొవ్వూరులో మాక్‌డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో


తాళ్లపూడిలో..


ఉండ్రాజవరంలో ..


చాగల్లు హైస్కూల్లో...

కొవ్వూరు, మే8(ఆంధ్రజ్యోతి):దేశానికి ప్రజలు అండగా నిలవాలని కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. శత్రుదేశం నుంచి బాంబు దాడి జరిగితే దాడిలో గాయపడిన వారిని రక్షించి, తక్షణ వైద్యసేవలు అందించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి అంశాలపై ఫైర్ అధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్ చేసి చూపించారు. పట్టణ సీఐ పి. విశ్వం, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె. సంధ్య, డాక్టర్ ఎస్. ధర్మరాజు, మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, ఎంఈవోలు బి. స్వరూప్, కె.రామ్‌కిషోర్, మున్సిపల్ మేనేజర్ పి. సాయిబాబు, వివిధ ప్రభుత్వశాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆంధ్రాసుగర్స్ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో మేనేజర్ ఈదర కృష్ణారావు ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: దేశంలో ఒకవేళ యుద్ధం వస్తే ప్రజలు ఏవిధంగా రక్షణగా ఉండాలో ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి ఆధ్వర్యంలో తాళ్లపూడి బస్టాండ్ సెంటరులో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఎస్ఐ టి .రామకృష్ణ, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు ఇందుగుల రామకృష్ణ, గోకవరపు జితేంద్రరవి, పలు గ్రామాల వీఆర్‌వోలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం పోలీసుస్టేషన్ వద్ద సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని కోరారు. ఎంపీడీవో వీఎస్ రామారావు, ఎస్సై జి. శ్రీనివాస రావు, ఏఈ భవాని, సీహెచ్‌వో సుబ్రహ్మణం, విఆర్వోలు, ఆరోగ్యసిబ్బంది, ఉపాధిహామీ పథకం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు నిర్లక్ష్యం వీడి అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కే.నరేంద్ర అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్లో జరిగిన మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎంపీడీవో ఆర్. శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ యుద్ధం వస్తే శత్రు దేశాన్ని తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం బస్‌స్టేషన్ వద్ద విద్యార్థులతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాయుడు, ఎంపీడీవో సింహాద్రిరావు, ఎస్ఐ సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యుడుగంగాధర్ పాల్గొన్నారు.

దేవరపల్లి: కేంద్రం ఉగ్రవాదులను అణిచివేయడానికి సిందూర్ ప్రకటించటంతో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి సూచనల మేరకు దేవరపల్లిలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు తహశీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం దేవరపల్లి బస్టాండ్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించగా, ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు కన్పిస్తే సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని రెవెన్యూ, పోలీస్‌శాఖ మాక్‌డ్రిల్‌ను నిర్వహించాయి.ఈసందర్భంగా తహశీల్దార్ అజయ్‌బాబు మాట్లాడుతూ యుద్ధం అనివార్యమయితే ప్రజలు ఎదుర్కోవాల్సిన విధివిధానాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, మండల పార్టీ అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి దివ్య కల్యాణం


కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, మే8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసివున్న రుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాలస్వామి దివ్యకల్యాణ మహోత్సవాన్ని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోవర్ధనం దుర్గాప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించగా, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల అభివృద్ధికే గ్రామసభలు : ఎమ్మెల్యే


చోడవరంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

నల్లజర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందితే పరిశ్రమలు ఏర్పడతాయని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. గురువారం తెలికిచర్ల, తూర్పు, పశ్చిమ చోడవరం, గుండెపల్లి, అనంతపల్లి, నబీపేట, పోతీనీడు పాలెం, చాదరాశిగుంట, పోతవరం, సుభద్ర పాలెం, అచ్చన్నపాలెంలో గ్రామసభలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ షేక్‌మీరా సాహెబ్, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, పడమర చోడరం సర్పంచ్ పెండ్యాల హిమ బిందు, చందు, మద్దిపాటి సుబ్బారావు, తెలికిచర్ల సర్పంచ్ బండి చిట్టి, పోతీనీడుపాలెం సర్పంచ్ పిచ్చుకల గణపతి, పోతవరం ఉపసర్పంచ్ ఏలేటి సత్యనారాయణ (జేడీ) పసుమర్తి రతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వార్డులో పక్కా రోడ్లు : చైర్మన్


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి

నిడదవోలు, మే8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి వార్డులో పక్కా రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. గురువారం 4వ వార్డులో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్ రూ. ఏడు లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గంగుల వెంకట లక్ష్మి, గోపిరెడ్డి శ్రీనివాస్, జనసేన నాయకులు రంగా రమేష్, క్రొవ్విడి బాలు, బీజేపీ నాయకులు మోర్త ప్రమోద్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పరిరక్షణ సమితి పట్టణ బంద్ రద్దు

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ మధ్య ఉద్రిక్తత వాతావరణం నేపథ్యంలో రైల్వే పరిరక్షణ సమితి చేపట్టిన పట్టణ బంద్‌ను రద్దు చేసినట్టు పరిరక్షణ సమితి సభ్యుడు వీటీ విల్సన్‌రాజు తెలిపారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి హాల్టుల పునరుద్ధరణకు ఈ నెల 9వ తేదీన పట్టణ బంద్‌కు నిర్ణయించామన్నారు. అయితే పహల్గాం శాంతిభద్రతల దృష్ట్యా బంద్‌ను రద్దు చేశామన్నారు. కార్యక్రమంలో పడాల సుబ్బారెడ్డి, వైకే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంలు, సీసీలకు ఒక్కరోజు శిక్షణ

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏపీఎంలు, సీసీలు, వీవోఏలకు కొత్తబుక్ కీపింగ్ 2.0 పై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్‌వీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ గ్రామాలలో చేపట్టిన సర్వేలు ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. దానికి పూర్తి బాధ్యత సీసీలు తీసుకోవాలని, ఏపీఎంలు మండలంలో మోనటరింగ్ చేయాలని సూచించారు.

మహాలక్ష్మి అమ్మవారి వార్షిక సంబరాలు

చాగల్లు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాలక్ష్మి అమ్మవారి వార్షిక సంబరాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు, పంచాహ్నిక దీక్ష పూజా కార్యక్రమాలు కొఠారు వెంకట రమేష్, దేవీప్రసన్న దంపతులు కలశ స్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు భగవద్గీత పారాయణం నిర్వహించారు. కాగా ఈ ఉత్సవాలు 12వ తేదీ వరకు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మోటారుసైకిల్ దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్ దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. వివరాలివి... దొమ్మేరుకు చెందిన సత్యసాయి ఏప్రిల్ 18వ తేదీన రాత్రి ఇంటిముందు మోటారుసైకిల్‌ను పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి బండి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : పేకాట శిబిరంపై దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. దొమ్మేరులో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి దాడి చేశారు. ఇందులో వారి వద్ద నుంచి రూ. 3,910 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మునిపల్లిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం


టోర్నీను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

నిడదవోలు, మే 8 (ఆంధ్రజ్యోతి):క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. గురువారం మునిపల్లిలో మునిపల్లి ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఎంపీఎల్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. అప్పుడే తగిన గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైనాట్ షోరూమ్ అధినేత జుజ్జవరపు వెంకట్రాయుడు, టీడీపీ నాయకులు సుంకవల్లి శ్రీరామారావు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు


శ్రీవారి ఆలయం వద్ద కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న దృశ్యం

దేవరపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఆలయం వద్ద విశ్వక్‌సేనారాధన, కుంభారాధన, నిత్యహోమం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభకళాన్యాసం, సాయంత్రం ధ్వజారోహణం, కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీవారి డోలోత్సవం, ముంజల్‌సేవ, పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించారు. అనంతరం దేవరపల్లికి చెందిన కేసి రాజు శారదా దేవి బృందంచే సంగీత సంకీర్తనామృతం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీని వాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో వర్షం



కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : : కొవ్వూరు పట్టణంలో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడారు. ఒక పక్క ఎండవేడిమి, మరోపక్క విద్యుత్ కోతతో ఇక్కట్లకు గురయ్యారు. మధ్యాహ్నం 2-40 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు గంటసేపు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు.

కమనీయం.. దివ్య కల్యాణం!

● దర్శించి తరించిన భక్తజనం
● పులకించిన రత్నగిరి
● వెండి గరుడ వాహనంపై స్వామి, వెండి గజవాహనంపై అమ్మవారి ఊరేగింపు



అన్నవరం, మే 8(ఆంధ్రజ్యోతి): భువన మోహన రూపుడైన సత్యదేవుడి కల్యాణం గురువారం రాత్రి రత్నగిరిపై భక్తజన నేత్రానందంగా అంగరంగ వైభవంగా జరిగింది. ఆద్యంతరహితుడైన స్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా కల్యాణ శోభతో శోభిల్లింది. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నాందీదేవత పఠన నిర్వహించిన అర్చకులు ధ్వజారోహణం చేసి గరుడ ద్విభాగం ఎగురవేసి స్వామి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. చైర్మన్ ఐవీ రోహిత్ పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. రాత్రి ఏడు గంటలకు బాజాభజంత్రీలు, వేదమంత్రాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ సత్యదేవుడికి వెండి గరుడ వాహనంపైన, అనంతలక్ష్మి అమ్మవారికి వెండి గజ వాహనంపై గ్రామోత్సవం జరిపి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సర్వశిల్పకళా శోభితమై వివిధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాల అలంకరణతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వార్షిక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి అర్చకస్వాములు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన సీతారాములను మరో వేదికపై ఆశీనులు గావించి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కన్యావరుణ ఇచ్చి అమ్మవారితో మంగళగౌరీ పూజ చేయించారు. స్వామి, అమ్మవార్ల వంశవృక్షాలను వివరించే ప్రవరలను వేద పండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా స్వామికి అలంకరించారు. శ్రీచరణుని పాదాలను పవిత్ర జలంతో కడిగి పాదప్రక్షాళన, మధుపర్కప్రాశన జరిపి మధుపర్కాలను స్వామికి ధరింపజేశారు. చతుర్వేద పండితులు దేశ కాలమాన పరిస్థితులను వివరించే మహాసంకల్పం చెప్పి చూర్ణికా మంత్రాలు పఠించారు. సుముహూర్త వేళ భక్తరక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఉంచారు. అమ్మవారికి దివ్యతేజస్సు ప్రసాదించే యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించగా భక్తజన గోవింద నామస్మరణ మధ్య మాంగల్యం తంతునా నేనా లోకరక్షణ హేతునా అంటూ అమ్మవారి మెడలో స్వామి మూడుముళ్లు వేశారు. స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు మంచి ముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ భక్తులకు నేత్రానందం కలిగించారు. పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్లు దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ తంతును ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి నిర్వహించగా వేడకలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. కల్యాణాన్ని వీక్షించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు. కల్యాణం అనంతరం తొమ్మిది ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతల ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కొవ్వూరు డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు ఆర్టీసీ సర్వీసులు

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ఆర్టీసీడిపో నుంచి ప్రతిరోజూ హైదరాబాద్‌కు రెండు సర్వీసులు నడుపుతున్నట్టు ఆ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ4943/44 సర్వీస్ రాత్రి 6 గంటలకు కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్లి, గామన్‌బ్రిడ్జి మీదుగా మళ్లీ కొవ్వూరు డిపోకు వచ్చి రాత్రి 7-40 నిమిషాలకు బయలుదేరి కాపవరం, పెద్దేవం, తాళ్లపూడి, అన్నదేవరపేట, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ఖమ్మం మీదుగా హైదరాబాద్ చేరుకుంటుంది. తిరిగి హైదరాబాద్‌లో (బీహెచ్ఈఎల్) రాత్రి 7-44 గంటలకు బయలుదేరుతుందన్నారు. అలాగే 4945/46 సర్వీస్ రాత్రి 6-45 గంటలకు కొవ్వూరు నుంచి బయలుదేరుతుందన్నారు.

తండ్రిని గాయపర్చిన కొడుకు.. కేసు నమోదు

కొవ్వూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : తండ్రిని గాయపర్చిన ఘటనలో కొడుకుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పట్టణంలోని ఔరంగాబాద్‌కు చెందిన రాచర్ల రాజబాబు సోదరుడి అంత్యక్రియలకు గురువారం వెళ్లగా, అక్కడ కొడుకు అజయ్‌బాబుతో ఘర్షణ పడ్డాడు. పాత గొడవల నేపథ్యంలో అజయ్‌బాబు తండ్రిని కర్రతో కొట్టి గాయపర్చాడు. దీంతో రాజబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి.నెం.17867/1997-జి1 తేదీ. 06-05-2025

ప్రకటన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల దానవాయిపేట లే-అవుటు నందలి స్థలములకు చేర్చి ఉన్న కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు స్థల యజమానులు ఆక్రమించుకొని నిర్మాణములు చేసుకొనియున్నారు. సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలముల యొక్క ఆవశ్యకత ప్రస్తుతము లేనందున సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు అనగా కన్సర్వేన్సీ లేన్ స్థలముల ఆక్రమణదారులకు విక్రయించుటకు తీర్మానము నెం. 03/471/2011, తేదీ 30-04-2011 నందు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించినారు. సదరు విషయమై ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 488, తేదీ 11-12-2013 నందు దానవాయిపేట నందలి కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారిని అనుమతించియున్నారు. శ్రీయుత జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు చదరపు గజము ఒక్కింటికీ నిర్ణయించు ధరకు లోబడి దానవాయిపేట కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు గాను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించియున్నారు.

ఇందు పై సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలములను గుర్తించి సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొనవలసినదిగా ఈ కార్యాలయము వారిచే నోటీసులు జారీ చేయడమైనది.

ఇందుపై ఈ క్రింది తెలిపిన మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులు కొనుగోలు చేయుటకు ఆసక్తి వ్యక్తపరచి దరఖాస్తులు దాఖలు చేసియున్నారు.

క్రమ సంఖ్య	కన్సర్వెన్సీ సర్వేనెంబర్ మరియు డోర్ నెంబర్	దరఖాస్తుదారు పేరు (కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమాని	కన్సర్వేన్సీ లేన్ స్థల విస్తీర్ణము	కన్సర్వేన్సీ లేన్ స్థలమునకు సరిహద్దులు
1.	దగ్గర తలుపు నెంబరు 46-16-39, వార్డు మెంబరు 5,బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం.494/P, 495/P & 492/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీసయ్యద్ నసీర్ తండ్రి సయ్యద్ శిలార్	15.89చ.గలు 6'-6'x 22'-0" 13.28 చ.మీ	తూర్పు:టి.ఎస్.నెం.492/పి 22'-0' పడమర:దరఖాస్తు దారుని స్థలము టి.ఎస్.నెం 495/పి & 496/పి-22'-0 ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.492/పి -6'-6' దక్షిణము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 492/పి-6'-6'
2.	దగ్గర తలుపు నెంబరు 46-22-07, వార్డు మెంబరు 5,బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం.309 & 310/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ నిట్టల సూర్యనారాయణ మూర్తి & నిట్టల ఆదిత్య	65.00 చ.గలు 90'-0'x 6.6" 54.34 చ.మీ	తూర్పు:టి.ఎస్.నెం.310/పి 90'-0' పడమర:దరఖాస్తు దారుని స్థలము టి.ఎస్.నెం 309-90'-0 ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.310/పి -6'-6' దక్షిణము:రోడ్డు టి.ఎస్.నెం. 310/పి-6'-6'
3.	దగ్గర తలుపు నెంబరు 46-16-11, వార్డు నెంబరు 5,బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం.516/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	ది.ప్రెసిడెంటు నివేదిత కిశోర్ విహార్ తెలుగు మీడియం ఎయిడెడ్ హై స్కూల్	86.65 చ.గలు 120 x (6+7)/2 72.45 చ.మీ	తూర్పు:దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.512పి -120'-0' పడమర:టి.ఎస్ నెం.516/పి-120'-0" ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.516/పి -7'-0' దక్షిణం:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 516/పి-6'-0
4.	దగ్గర తలుపు నెంబరు 46-11-6, వార్డు నెంబరు 5,బ్లాకు నెంబరు 9, టి.ఎస్. నెం.640/P & 642/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	చింతా వెంపారెడ్డి & మల్లిడి ఝాన్సీలక్ష్మి	36.67 చ.గలు (60'-0')x (5'-6') 30.66 చ.మీ	తూర్పు:దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.640/పి -60'-0' పడమర:టి.ఎస్ నెం.642/పి-60'-0" ఉత్తరము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.642/పి 5'-6' దక్షిణం:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.642/పి -5'-6'
5.	దగ్గర తలుపు నెంబరు 46-15-15/2, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 8, టి.ఎస్. నెం.523/P దానవాయిపేట, రాజమహేంద్రవరం	కె.శ్రీదేవి, భర్త: వేణు గోపాల్	21.67 చ.గలు (30'-0'x 6-'6') 18.11 చ.మీ	తూర్పు:దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.523/పి -30'-0' పడమర :కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం." 527/పి-30"-0" ఉత్తరము కన్సర్వేన్సీ లేన్ స్థలము టి. ఎస్.నెం.527/పి-6'-6' దక్షిణము:కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం.527/పి -6'-6"

కావున పైన పొందుపరచిన కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులకు విక్రయించుటకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఏడు (7) రోజుల్లోపు లిఖితపూర్వకంగా నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరడమైనది.

కమిషనరు,
నగర పాలక సంస్థ, రాజమహేంద్రవరం.